సాక్షి ప్రకాశం
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



రూ.కోట్లు కొల్లగొట్టినా గుంభనంగా విచారణ

టంగుటూరు టీడీపీ నేత పొగాకు కంపెనీలో రూ.20 కోట్ల నగదు గోల్‌మాల్‌పై విచారణ గుంభనంగా సాగుతోంది.

- 8లో..



పొగాకు పంట నియంత్రణ పాటించాలి

రైతులు పొగాకు పంట సాగులో నియంత్రణ పాటించాలని బోర్డు చైర్మన్ యశ్వంత్ అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లా నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వారు వరుసగా రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన డాక్టరు కటికల ప్రశాంత్‌కుమార్, రాష్ట్ర బూత్ కమిటీస్ వింగ్ జనరల్ సెక్రటరీగా ఒంగోలు నియోజకవర్గానికి చెందిన వై.వి.గౌతమ్‌అశోక్, రాష్ట్ర ఐటీ వింగ్ సెక్రటరీగా గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన గొంగటి విష్ణువర్ధన్‌రెడ్డిలను నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది.

కనిగిరి డిపోను సందర్శించిన ఆర్టీసీ వైస్ చైర్మన్



మొక్కలు నాటుతున్న ద్వారకా తిరుమలరావు, సన్నపురెడ్డి సురేష్

కనిగిరిరూరల్: కనిగిరి ఆర్టీసీ డిపోను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, ప్రజా రవాణాశాఖ కమిషనర్, ద్వారకా తిరుమలరావు, జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి బుధవారం సందర్శించారు. డిపోలో సమస్యలను తెలుసుకున్నారు. గ్యారేజీ కార్మికులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ రెవెన్యూ పెంచాలని సూచించారు. గ్యారేజ్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఈడీ ఆపరేషన్స్ అప్పలరాజు, ఈడీ జోన్ నాగేంద్ర ప్రసాద్, డీపీటీఓ సత్యనారాయణ, డిప్యూటీ సీటీఎం రవికాంత్, డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం పాల్గొన్నారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు.

కిల్కారీ అమలు తీరు పరిశీలన

ఒంగోలు టౌన్: ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలో కిల్కారి కార్యక్రమం అమలు తీరును పరిశీలించింది. జిల్లా అధికారులతో మాట్లాడి కిల్కారి కార్యక్రమాన్ని మరింత మెరుగు పరచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో అడిగి తెలుసుకుంది. జిల్లాలోని గర్భిణులు, బాలింతలు ఈ కార్యక్రమాన్ని ఏ మేరకు ఉపయోగించుకుంటున్నారో ఆరా తీసింది.



పొగాకు రైతు ఉక్కిరిబిక్కిరై..

అసమర్థత పెనాల్టీలై!

గిట్టుబాటు ధర రాక ఒకవైపు..వేలం కేంద్రాల్లో తిరస్కరణకు గురౌతున్న బేళ్లతో మరోవైపు ఉక్కిరిబిక్కిరి అవుతున్న పొగాకు రైతును పాలకులు కోలుకోలేని దెబ్బతీస్తున్నారు. కూటమి పాలకులు, బోర్డు అధికారులు కంపెనీలతో కుమ్మక్కై పొగాకు రైతును నట్టేట ముంచేశారు. అది చాలదన్నట్టు అదనపు కొనుగోళ్లపై జరిమానా వసూలు చేస్తామని బోర్డు అధికారులు షాక్ ఇస్తున్నారు. అదనపు కొనుగోళ్లపై గరిష్టంగా మూడు శాతం, బోర్డు అనుమతి లేకుండా పండించిన పొగాకు అమ్మకాలపై 6 శాతం జరిమానా వసూలు చేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. కొనుగోళ్లు ప్రారంభమై ఏడు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయలేని బోర్డు నేడు రైతులపై భారం మోపడం సరికాదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యతో అదనపు పొగాకు అమ్మకాలపై పూర్తి జరిమానాలు రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కానీ ప్రస్తుత ప్రభుత్వ అసమర్థత వల్ల తిరిగి జరిమానాలు అమల్లోకి వచ్చాయన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

అపరాధ రుసుము లేకుండా కొనుగోలు చేయాలి



రైతుల వద్ద ఉన్న అనధికార ఉత్పత్తి పొగాకును అపరాధ రుసుము లేకుండా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. అసలకే ఈ ఏడాది నష్టాలు పాలవుతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే అపరాధ రుసుము భయం పట్టుకుంది. అపరాధ రుసుము విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలి. కేవలం 10 శాతమే కొనుగోలు చేస్తామని బోర్డు అధికారులు చెబుతున్నారు.

– రాయపాటి సురేష్, నేతివారిపాలెం గ్రామం, కొండపి మండలం, పొగాకు రైతు.

- ఆర్థికంగా చితికిపోయిన పొగాకు రైతుపై జరిమానా పిడుగు
- వైఎస్సార్ సీపీ హయాంలో జరిమానాల్లేకుండా చర్యలు
- రీజియన్ పరిధిలో 11 వేలం కేంద్రాల్లో 54 మిలియన్ కేజీల అదనపు సాగు
- రైతులపై ఆరు శాతం పెనాల్టీ భారం
- అదనపు సాగు నియంత్రణకే చర్యలు అంటూ బోర్డు అధికారుల బొంకులు
- కూటమి పాలకుల తీరుపై పొగాకు రైతు మండిపాటు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. 2024–25 పంట కాలంలో 104.6 మిలియన్ కేజీల పొగాకు పండించేందుకు బోర్డు అనుమతి ఉంది. అయితే నాలుగేళ్లుగా వస్తున్న లాభాలతో ఈ ఏడాది పొగాకు సాగువైపు రైతులు అధికంగా మొగ్గు చూపారు. సాగు సమయంలో కంపెనీలు సైతం అదనపు సాగువైపు రైతులను పురిగొల్పాయి. ఫలితంగా పరిమితిని మించి 158.6 మిలియన్ కేజీల వరకు పొగాకు ఉత్పత్తులు రావచ్చని బోర్డు అధికారులు అంచనా వేశారు. దాదాపు 54 మిలియన్ కేజీల వరకు బోర్డు అనుమతి మించి అదనపు పొగాకు పండింది. ప్రస్తుతం అదనపు పొగాకు అమ్మకాలకు బోర్డు విధించిన జరిమానాలు చెల్లించి అమ్ముకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రకాశం రీజియన్ పరిధిలో అధికారిక పొగాకు అమ్మకాలు 95 మిలియన్ కేజీల వరకు పూర్తయ్యాయి. అంటే అధికారికంగా ఇంకా కొనాల్సిన పొగాకు కేవలం 9.6 మిలియన్ కేజీలు మాత్రమే ఉంది. ఆ తరువాత జరిగే అన్ని అదనపు పొగాకు కొనుగోళ్లపై బోర్డు జరిమానాలు అమల్లోకి రానున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి కంపెనీల మాయాజాలం, బోర్డు అధికారుల నిర్లక్ష్యం, ఆర్భాటపు ప్రకటనలకే కూటమి పాలకులు పరిమితం కావడంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. మద్దతు ధర కోసం పలు దఫాలుగా ఆందోళనలు చేసినా ఎలాంటి మార్పు రాలేదని రైతులు ఆగ్రహం చెందుతున్నారు. వేలం కేంద్రానికి వచ్చిన బేళ్లను నాణ్యత పేరుతో దాదాపుగా 60 శాతం బేళ్లను వెనక్కు పంపుతున్నారు. ఫలితంగా రైతుపై రవాణా భారం పడుతోంది.

గరిష్టంగా 3 శాతం వరకు జరిమానా

బోర్డు అనుమతించిన పరిమితి కంటే అదనంగా పండించిన పొగాకును అదనపు సాగు అంటారు. 2024–25 పంట కాలానికి సంబంధించి దక్షిణాది తేలిక నేలల పరిధిలో ఒక బ్యారన్‌కు 42క్వింటాళ్ల వరకు పొగాకు పండించేందుకు బోర్డు అనుమతిచ్చింది. 42 క్వింటాళ్లను మించి పండించే పొగాకు మొత్తం నిబంధనల ప్రకారం అదనపు పొగాకు కిందకు వస్తుంది. ఈ అదనపు పొగాకు అమ్మకాలపై పొగాకు బోర్డు మూడు శ్లాబ్‌లుగా జరిమానాలు వసూలు చేయనుంది. రైతు తన కోటాను మించి జరిగే 10 శాతం అదనపు పొగాకు అమ్మకాలపై ఎటువంటి జరిమానాలు విధించడం లేదు. అంటే తన కోటాను మించి 4 క్వింటాళ్ల వరకు రైతు ఎటువంటి జరిమానాలు లేకుండా అమ్ముకోవచ్చు. 10 నుంచి 20 శాతం అదనపు పొగాకుపై 2 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే 20 శాతం మించి జరిగే అమ్మకాలపై 3 శాతం వరకు జరిమానా చెల్లించాలి. ఇక బోర్డులో రిజిస్టర్ కాని రైతులు పండించే అనధికారిక పొగాకును అమ్ముకోవాలంటే 6 శాతం వరకు జరిమానాను చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఒక రైతు రూ.1 లక్ష విలువ చేసే ఉత్పత్తులను అమ్ముకుంటే రూ.3 వేల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంది. దీనికి రెగ్యులర్‌గా విధించే సర్వీస్ చార్జీ, కేజీకి ఒక రూపాయి పెనాల్టీ అదనం. దీంతో అదనంగా పొగాకు పండించిన రైతులకు ఈ ఏడాది జరిమానాల రూపంలో భారం పడనుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తిగా రద్దు:
వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అదనపు పొగాకు పొగాకు కొనుగోళ్లపై జరిమానాలను పూర్తి రద్దు చేసింది. దీంతో రైతులు ఎటువంటి జరిమానాలు లేకుండానే అదనపు పొగాకు ఉత్పత్తులను వేలం కేంద్రాల్లోనే విక్రయించుకున్నారు. కేజీ పొగాకు అత్యధికంగా రూ.365కు కూడా అమ్మిన సందర్భాలున్నాయి. దీనికి తోడు అదనపు పొగాకు ఉత్పత్తులపై జరిమానాను పూర్తిగా రద్దు చేయడంతో, పొగాకు ముక్క, చూర వంటి వాటిని కూడా నేరుగా వేలం కేంద్రాల్లో విక్రయించుకునే వెసులుబాటు దక్కింది. దీంతో ప్రతి రైతుకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు అదనపు లబ్ధి చేకూరింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పొగాకు ధరలు అమాంతం పడిపోయాయి. గ్రేడ్–1 పొగాకు కేజీ రూ.280 మాత్రమే నిన్న మొన్నటి వరకు పలికింది. అదే సందర్భంలో గతంలో గ్రేడ్‌లతో సంబంధం లేకుండా పొగాకు అమ్ముడు పోగా, ఈ ఏడాది లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. కనీసం పెట్టుబడి ఖర్చులు వచ్చినా నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అదనపు పొగాకు అమ్మకాలపై జరిమానాలు విధించడం నట్టేట ముంచేయడమేనినని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే సాగు నియంత్రణ చర్యల్లో భాగంగానే జరిమానాలు విధిస్తున్నామని బోర్డు అధికారులు బొంకుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలే ధరలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో రైతులపై భారం మోపడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రుసుము, సర్వీసు చార్జీ ఎత్తివేయాలి



ఈ ఏడాది పొలం, బ్యార్నీ కౌలు, ఖర్చులు ఎక్కువయ్యాయి. దీనికి తోడు దిగుబడి తగ్గింది. ధరలు అంతంతమాత్రంగా ఉండి నష్టాలు తప్పవని రైతులు వాపోతుంటే అనధికారిక పొగాకు ఉత్పత్తి అమ్మకాలపై సర్వీసు చార్జీ, పెనాల్టీ విధిస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులను ఆదుకావాల్సిన ప్రభుత్వాలు, రైతులపై రుసుము విధించడం ఏమిటి, రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం రుసుము, సర్వీసు చార్జీ లేకుండా కొనుగోలు చేయాలి.

– రాయిండ వెంకట నారాయణ, పొగాకు రైతు, పొందూరు, టంగుటూరు మండలం

అనధికార పొగాకు అమ్మకాలపై పెనాల్టీ తీసేయాలి



పొగాకు రైతులు పెట్టుబడులు ఎక్కువయ్యాయని ఈ ఏడాది నష్టాలతో అల్లాడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ప్రభుత్వాలు అనధికార పొగాకు కొనుగోళ్లపై పెనాల్టీ విధిస్తోంది. రైతుల కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి అనధికారిక ఉత్పత్తి అమ్మకాలపై సర్వీసు చార్జీ, పెనాల్టీ తీసేయించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం.

– కాకుమాని కోటేశ్వరరావు, పొగాకు రైతు, జమ్ములపాలెం గ్రామం, టంగుటూరు మండలం

పల్లె జనానికి అనంత కష్టాలు

- అనంతపురం సభకు జిల్లా బస్సులు
- జిల్లాలో 452 బస్సులు ఉండగా 160 బస్సులు తరలింపు
- అనధికారికంగా 300కుపైగా బస్సులు పంపిన వైనం
- నానా అగచాట్లు పడిన ప్రయాణికులు
- గంటల తరబడి పడిగాపులతో మహిళా ప్రయాణికుల ఇబ్బందులు
- జిల్లాలోని 5 ఆర్టీసీ డిపోలపై రూ.5 కోట్లకు పైగా భారం



బస్సుల్లేక ఖాళీగా దర్శనమిస్తున్న ఒంగోలు బస్టాండ్



మార్కాపురం బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఒంగోలు టౌన్/మార్కాపురం: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ సభ పల్లెజనానికి కష్టాలు తెచ్చిపెట్టింది. ఒకవైపు ఎండవేడి, మరోవైపు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించి అవస్థలు పడ్డారు. ప్రధానమైన రూట్లలో బస్సుల సంఖ్య తగ్గడంతో ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారి ఓపికను అధికారులు పరీక్షించారు. ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలో సభ జరుగుతుంటే ఇక్కడ నుంచి బస్సులను తరలించడమేమిటని ప్రయాణికులు మండిపడుతుతున్నారు. ప్రజల సొమ్ముతో సొంత కూటమి సభలు పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు పడిన అవస్థలు వర్ణనాతీతం. రెండు రోజుల నుంచి బస్సు సర్వీసులు తగ్గించడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. పశ్చిమ ప్రకాశం మార్కాపురం, గిద్దలూరు నుంచి నంద్యాల, కడప, కంభం, రాచర్ల, కొమరోలు, ఒంగోలు తదితర ప్రాంతాలకు ఎక్కువ మంది వెళ్తుంటారు. మార్కాపురం, గిద్దలూరు, పొదిలి డిపోల నుంచి 101 సర్వీసులను అనంతపురం సభకు పంపారు. దీంతో రెండు రోజులుగా పశ్చిమ వాసులు పడరాని అగచాట్లు పడ్డారు. ఒంగోలు ఆర్టీసీ డిపోలో మొత్తం 74 పల్లె వెలుగు బస్సులున్నాయి. అందులో 52 ఆర్టీసీ బస్సులు కాగా మిగిలిన 22 బస్సులు అద్దె బస్సులు. ఈ 52 బస్సుల్లో 38 బస్సులను అనంతపురంలో జరిగిన సభకు తరలించారు. మిలిగిన 14 బస్సులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

డిపోలు	కేటాయించిన బస్సులు
మార్కాపురం	41
పొదిలి	26
గిద్దలూరు	34
ఒంగోలు	38
కనిగిరి	21

రాప్తాడు, సింగనమలకు జిల్లా బస్సులు:
అనంతపురం సభకు జిల్లాలోని ఒంగోలు, పొదిలి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను పంపించారు. ఈ ఐదు ఆర్టీసీ డిపోల్లో మొత్తం 452 బస్సులు ఉన్నాయి. ఇందులో 315 బస్సులను స్త్రీ శక్తికి కేటాయించారు. ఈ మొత్తంలో సుమారు 160కు పైగా బస్సులను అనంతపురం సభకు తరలించామని అధికార వర్గాలు చెబుతుండగా 300పైగా బస్సులు వెళ్లాయని ఆర్టీసీ వర్గాలే గుసగుసలాడుతున్నాయి. ఈ బస్సులకు అనంతపురం జిల్లా రాప్తాడు, సింగనమల మండలాలు కేటాయించారు. మంగళవారం జిల్లా నుంచి బయలు దేరిన బస్సులు రాత్రికి ఆయా మండలాల్లో కేటాయించిన గ్రామాలకు చేరుకుని బుధవారం ఉదయం ఆయా గ్రామాల నుంచి సమీకరించిన జనాలను అనంతపురంలోని సభావేదిక వద్దకు చేర్చాయి. సభ అయిన తరువాత తిరిగి వారిని స్వస్థలాలకు చేర్చాలని అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

జిల్లాపై రూ.5 కోట్ల భారం:
అనంతపురం సభకు జిల్లాలోని ఆర్టీసీ బస్సులన్నిటినీ తరలించాల్సి రావడంతో ఆర్టీసీకి భారీగా కష్టం పడినట్లుంది. సహజంగా అయితే సీటింగ్ ప్రకారం రానుపోను లెక్కేసి అద్దె చెల్లిస్తారు. ఒక్కో పల్లెవెలుగు బస్సుకు రోజుకు రూ.55 వేల ఖర్చు వస్తుంది. ఈ లెక్కన ఒక్క ఒంగోలు డిపోకు సుమారు కోటి రూపాయల వరకు నష్టం వస్తుందని యూనియన్ నాయకులు లెక్కలేస్తున్నారు. జిల్లాలోని 5 డిపోలకు కలుపుకొని రూ.5 కోట్ల ప్రజల సొమ్ము కూటమి పాలైనట్లేనని చెబుతున్నారు. ప్రభుత్వం పేరుతో కూటమి పాలకులు కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును వృథా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

రాజన్న రైతు రాజ్యం

జగనన్నకే సాధ్యం



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

- సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయింది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: ఆనాటి రాజన్న రైతు రాజ్యం మళ్లీ రావాలంటే జగనన్నకే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరైన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలకు పూలు చల్లుతూ డప్పు వాయిద్యాల మధ్య గ్రామంలోకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు లేనివారికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని నిరుద్యోగులను దారుణంగా మోగించారన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని మహిళలను మోసం చేశారన్నారు. మహిళలకు సంవత్సరానికి 3 సిలిండర్లు ఇస్తామని అరకొర విదిలించి మోసం చేశారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని మాట తప్పి రూ.5 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన మోసాలే ఈ కూటమి ప్రభుత్వంలో కూడా చేస్తున్నారన్నారు. ఈ పథకాలు ఎవరికైనా వచ్చాయా అని నిరుద్యోగులు, మహిళలను ప్రశ్నించారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అవుతారని, అప్పుడు అందరి కష్టాలు తీరుస్తారని అన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు గిట్టుబాటు ధరలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతుంటే మూలిగే నక్క మీద తాటికాయ పడిన సామెతగా ఎరువులు కొరత తెచ్చి వచ్చి రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. ప్రభుత్వం సబ్సిడీలో ఇవ్వాల్సిన యూరియా ఇవ్వక పోవడంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. యూరియా అక్రమ నిల్వలు గుర్తించారే కానీ ఆ నిల్వలు ఎక్కడి నుంచి వచ్చాయో మాత్రం వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రైతలకు ఇబ్బందులు లేకుండా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ బండి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర మున్సిపాలిటీ కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, మాజీ నెడ్‌కాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అమీన్ బాషా, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, గ్రామ నాయకులు శ్రీనివాసరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్లకు రూ.30 వేల సాయం అందించండి



నగరంలో ఆటోలతో ర్యాలీగా వస్తున్న డ్రైవర్లు

ఒంగోలు టౌన్: ఉచిత బస్సు పథకం వలన నష్టపోయిన ఆటో వర్కర్లకు వాహన మిత్ర ద్వారా రూ.30 వేల సాయాన్ని అందించి ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆటో వర్కర్లను ఆదుకోవాలని కోరుతూ బుధవారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో శ్రీనివాసులు మాట్లాడుతూ ఎంతో మంది ఉన్నత చదువులు చదువుకున్న నిరుద్యోగులు కుటుంబ పోషణ కోసం ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటో వర్కర్లు ఆటోల ద్వారా స్వయంగా ఉపాధి పొందుతున్నారని చెప్పారు. ప్రైవేటు ఫైనాన్స్‌లో అప్పులు తెచ్చుకొని ప్రతినెలా వడ్డీలు కడుతున్నారని, కిస్తీలు చెల్లిస్తూ పిల్లలను కష్టపడి చదివించుకుంటున్నారన్నారు. తాజాగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వలన ఆటోలకు కిరాయి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, డీజిల్, పెట్రోలు ధరలను పెంచడంతో వాహనాల నిర్వహణ భారంగా మారిందని చెప్పారు. వాహనాలు కొనుగోలు చేయడానికి వడ్డీ లేకుండా రూ.4 లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వాహన ఫిట్నెస్ స్టేషన్లను ప్రైవేటు పరం చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో ఆటో యూనియన్ నాయకులు కార్మిక సంఘాల నాయకులు తంబి శ్రీనివాసరావు, మహ్మద్ బేగ్, హుసేన్, సురేష్, చీకటి శ్రీనివాసరావు, ఏ.కోటేశ్వరరావు, టి.మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి

- ప్రభుత్వానికి కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం డిమాండ్
- దశలవారీ పోరాటాలకు సిద్ధమని స్పష్టీకరణ

ఒంగోలు సిటీ: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏసుపోగు జాన్ బాబు, సభ్యులు బి.వి.కాశీ రత్నం, షేక్. ఖాదర్‌వలి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం దశలవారీగా పోరాటాలకు సిద్ధమైనట్లు బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు జీఓఎంఎస్ నంబర్ 114ను 2023 అక్టోబర్ 21న విడుదల చేశారని తెలిపారు. అన్ని శాఖల్లో క్రమబద్ధీకరణ చేపట్టినా ఎన్నికల కోడ్ కారణంగా విద్యా శాఖలో నిలిచిపోయిందని, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రమబద్ధీకరణ చేయాలని అనేకమార్లు వినతులు సమర్పించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేని పరిస్థితుల్లో దశవారి పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 13వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో విజయవాడలోని ఎంబీ భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అప్పటికీ ఏ నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రంలోని మహిళా కాంట్రాక్ట్ లెక్చరర్లతో 36 గంటలపాటు దీక్ష చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి క్రమబద్ధీకరణ చేపట్టాలని, పని చేసిన 2024–2025 మే నెలకు వేతనం ఇవ్వాలని, 62 ఏళ్లకు సర్వీస్ పెంచాలని కోరారు. తమ పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలు పూర్తి మద్దతు తెలియజేశాయని పేర్కొన్నారు.

కారు బోల్తా.. ఒకరు మృతి

జరుగుమల్లి(సింగరాయకొండ): ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరుగుమల్లి మండలం చింతలపాలెం సమీపంలోని నక్కవాగు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం చింతలపాలేనికి చెందిన మాజీ ఎంపీపీ బెల్లం సత్యనారాయణ సోదరుడు చెంచురామానాయుడు(50) స్వగ్రామం నుంచి దావగూడూరుకు కారులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోనే కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్లో బోల్తా పడింది. చెంచురామానాయుడుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు స్పందించి 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు జీజీహెచ్ వైద్యులు నిర్ధారించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో ఉంచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

దోపిడీ కేసులో నిందితుడికి రెండున్నరేళ్ల జైలు

ఒంగోలు: దోపిడీ కేసులో నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.నవ్యశ్రీ బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు.. ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని అంకమ్మపాలెంలో పటాపంజుల సుగుణమ్మ నివసించేవారు. ఆమె ఇంటికి నిందితుడు వెళ్లి ఇల్లు అద్దెకు కావాలని కోరాడు. ఇంటి పరిసరాలను పరిశీలించి మరుసటి రోజు వచ్చి అడ్వాన్స్ ఇస్తానని నమ్మబలికాడు. 2024 ఆగస్టు 4వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అడ్వాన్స్ ఇవ్వడానికి వస్తున్నట్లు సుగుణమ్మకు నిందితుడు ఫోన్ చేశాడు. నగదు ఇచ్చే నెపంతో ఇంట్లోకి వెళ్లి తన వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో సుగుణమ్మ తల వెనుక కొట్టగా ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమె మెడలోని 6.5 సవర్ల బంగారు గొలుసు లాక్కుని నిందితుడు పరారయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం సుగుణమ్మ ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ సీఐ నాగరాజు తాళ్లూరు మండలం శివపురం గ్రామానికి రావిపాటి జగదీష్‌ను నిందితుడిగా గుర్తించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు వాదోపవాదనలు విన్న అనంతరం నిందితుడిపై నేరం నిరూపితమైనట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. నిందితుడికి రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా కేసు దర్యాప్తులో కృషి చేసిన సీఐ నాగరాజు, ఏపీపీ కె.కళావతి, కోర్టు లైజన్ ఆఫీసర్ ప్రసాదరావును ఎస్పీ దామోదర్ అభినందించారు.

21న ఎంబీఏ, ఎంసీఏ అర్హత పరీక్ష

ఒంగోలు సిటీ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ అర్హత పరీక్షను గీతం డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ ఎం.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా హాజరుకావాలని స్పష్టం చేశారు.

పత్రికల మీద కేసులు తగవు



ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఏదైనా వార్తల విషయంలో నచ్చని అంశాలు ఉంటే వాటిని ఖండించే అవకాశం ఉంది. వ్యక్తిగతంగా నష్టం కలిగించింది అనుకున్న సందర్భంలో న్యాయపరంగా చర్యలు తీసుకోవచ్చు. ఇన్ని మార్గాలు ఉండగా అక్రమంగా కేసులు నమోదు చేయడం, పాత్రికేయులను అరెస్టు చేయడం సమర్థనీయం కాదు. ప్రస్తుతం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు చెడు సంప్రదాయానికి దారితీస్తాయి.

– బి.శ్రీనివాసరావు, డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫోరమ్ కన్వీనర్



వాస్తవాలను దాచలేరు



పత్రికా స్వేచ్ఛ గురించి రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమాత్రం బాగాలేదు. పాత్రికేయుల మీద తప్పుడు సాక్ష్యాలతో అక్రమ కేసులు బనాయించడం సహేతుకం కాదు. ప్రభుత్వ విధానాల మీద ఎలాంటి వార్తలు రాయకూడదు, మాట్లాడకూడదు అంటే ఎలా? పాలకులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన బాధ్యత లేదా ? అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపడం ఎలా అసాధ్యమో వాస్తవాలను దాచిపెట్టాలనుకోవడం కూడా అంతే అసాధ్యం . పత్రికలు ప్రజల గొంతు వినిపించడం సహజం. దానికి ఉలికిపడటం సమర్థత అనిపించుకోదు.

– నగరికంటి శ్రీనివాసరావు, న్యాయవాది, ఒంగోలు బార్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ

రూ.కోట్లు కొల్లగొట్టినా..
గుంభనంగా విచారణ!

- టంగుటూరు టీడీపీ నేత పొగాకు కంపెనీలో రూ.20 కోట్ల సొమ్ము గోల్‌మాల్
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఫిర్యాదు లేకుండానే విచారణకు పూనుకున్న పోలీసులు
- అక్రమ వ్యాపారం గుట్టు రట్టవుతుందని పోలీసులను సైడ్ చేసిన వైనం
- తన కంపెనీ గోడౌన్‌లోనే గుమస్తాను గోప్యంగా విచారిస్తున్న టీడీపీ నేత
- 1.9 కేజీల బంగారం, రూ.8 కోట్ల నగదు రికవరీ చేసినట్లు జోరుగా ప్రచారం
- ఇప్పటికీ ఫిర్యాదు అందలేదంటున్న టంగుటూరు పోలీసులు
- గుమస్తాను రెండు రోజులు చిత్రహింసలు పెట్టినట్లు టంగుటూరు ఎస్సైపై హైకోర్టుకు ఫిర్యాదు



సాక్షి టాస్క్‌ఫోర్స్:

సుమతి శతక పద్యంలోని ''చీమలు పెట్టిన పుట్టలు పాములకిరువైనట్లు..'' వాక్యం.., అలాగే ''రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవేముంది'' అన్న తెలుగు సామెత అతికినట్లు సరిపోయే సంఘటన ఇది. పొగాకు వ్యాపారం చేసి, అక్రమ మార్గాలను అనుసరించి టంగుటూరు టీడీపీ నేత కూడబెట్టిన సొమ్ములో రూ.20 కోట్లను తన కింద పనిచేసే గుమస్తా కాజేసిన వ్యవహారం, అందుకు సంబంధించిన విచారణపై రోజుకో కథనం బయటకొస్తోంది. చిన్న చోరీ జరిగితే తక్షణమే అక్కడ వాలిపోయి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టే పోలీసులు.. టీడీపీ నేత పొగాకు కంపెనీలో రూ.20 కోట్లు గోల్‌మాల్ అయిన విషయంపై పెద్దగా స్పందించడం లేదు. మంత్రి ఆదేశాలతో ఫిర్యాదు లేకుండానే రంగంలోకి దిగి సెటిల్‌మెంట్ చేసేందుకు సిద్ధమైన పోలీసులకు బాధిత టీడీపీ నాయకుడే అడ్డు తగిలినట్లు జోరుగా చర్చ నడుస్తోంది.

మోసగాడే మోసపోయాడు!

తాడిని తన్నేవాడు ఒకడుంటే వాడి తలను తన్నేవాడు మరొకడుంటాడన్న సామెత పొగాకు కంపెనీ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో నిజమైంది. పొగాకు కంపెనీలో గుమస్తా చేతివాటం చూపించి రూ. 20 కోట్లు డబ్బులు కాజేయగా, గుమస్తా వద్ద సైబర్ నేరగాళ్లు రూ.7 కోట్లు మాయం చేశారు.

ఆరు నెలల క్రితమే స్కెచ్

టీడీపీ నేత సింగపూర్‌లో ఒక వివాహానికి వెళ్లడం, కొద్ది రోజుల తర్వాత తండ్రి మృతి చెందడం, పొగాకు కంపెనీల కార్యక్రమానికి విదేశానికి వెళ్లడం , తన కూతురు, భార్య అమెరికా వెళ్లే పనులను చక్కబెడుతూ ఆరు నెలలుగా వ్యాపార లావాదేవీలు పట్టించుకోలేదు. ఇదే అదనుగా భావించిన గుమస్తా క్రమంగా రూ.20 కోట్లు దారి మళ్లించాడు. అయితే ఒక లావాదేవీలో గుమస్తా బ్యాంకు ఖాతాకు రూ.90 వేలు జమ కావడాన్ని గుర్తించిన టీడీపీ నేత విషయం ఆరా తీయడంతో గోల్‌మాల్ వ్యవహారం బయటపడింది. ఓ మంత్రి సహకారంతో సిట్ అధికారులు, జిల్లా పోలీసులకు సమాచారం అందించి విచారణకు పూనుకున్నారు. గుమస్తాను బంధించి, అతని బావమరిదికి చెందిన టెంటు హౌసుకు తాళం వేశారు. మూడు డీజే వాహనాలను స్వాధీనం చేసుకుని పొగాకు కంపెనీలో ఉంచారు. ప్రస్తుతం యజమాని, గుమస్తా మధ్య శాంతి చర్చలు జరుతున్నాయని సమాచారం. పొగాకు కంపెనీలో పనిచేసే సిబ్బందిని సైతం రెండు రోజుల పాటు పనికి రావద్దని చెప్పడం అందుకు బలం చూకూరుస్తోంది. కొండపి మండలం గోగినేనివారి పాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి గుమస్తా రూ.2 కోట్లు బదిలీ చేసినట్లు తేలడంతో అతనిని కూడా పొగాకు కంపెనీలో గోప్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు గుమస్తా నుంచి 1.900 కిలోల బంగారం, అతని ఇంట్లో బెడ్ కింద దాచిన కొంత ధనం.. వెరసి మొత్తం రూ.8 కోట్ల మేర రికవరీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని టంగుటూరు పోలీసులు చెబుతుండటం గమనార్హం.

టంగుటూరు ఎస్సైపై హైకోర్టుకు ఫిర్యాదు

అధికార టీడీపీ నాయకుల ఒత్తిడితో టంగుటూరు గ్రామానికి చెందిన గుమస్తాను ఎస్సై నాగమల్లేశ్వర రావు రెండు రోజులపాటు విచారణ పేరులో చిత్రహింసలు పెట్టారని, కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, తమకు న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వులు అందుకున్న ఎస్సై హైర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరైనట్లు సమాచారం.

అక్రమాల గుట్టు రట్టవుతుందనేనా?

గత నాలుగైదేళ్లుగా టంగుటూరు టీడీపీ మండల అధ్యక్షుడి తమ్ముడు పొగాకు వ్యాపారం ద్వారా పెద్ద మొత్తంలోనే లాభాలు ఆర్జించినట్లు సమాచారం. అక్రమ మార్గాలు అనుసరించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడం, పొగాకు బోర్డుకు చెల్లించాల్సిన రుసుముకు ఎగనామం పెట్టడం, నిబంధనలకు విరుద్ధంగా రైతుల వద్ద అతి తక్కువ ధరకు పొగాకు కొనుగోలు చేసి స్వదేశీ, విదేశీ కంపెనీలకు విక్రయించడం లాంటి వ్యవహారాలతో టీడీపీ నేత రూ.కోట్లు కూడబెట్టినట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. కంపెనీలో రూ.20 కోట్లు దారి మళ్లించిన గుమస్తాను పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే అక్రమాల బాగోతం బట్టబయలవుతుందని భావించిన టీడీపీ నేత.. గుమస్తాను విచారించేందుకు తనే రంగంలోకి దిగినట్లు తెలిసింది. గత కొద్దిరోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు గుమస్తాను విచారించి లావాదేవీల లెక్కలు తేల్చి, సాయంత్రానికి గుమస్తాను తన ఇంటికి పంపిస్తున్నట్లు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

పొగాకు పంట నియంత్రణ పాటించాలి



మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్

టంగుటూరు:

రైతులు పొగాకు పంట సాగులో నియంత్రణ పాటించాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్, వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య అన్నారు. టంగుటూరు పొగాకు బోర్డును బుధవారం సందర్శించి పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా 2025–26 పంట కాలానికి పొగాకు పంట నియంత్రణ మీద నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులతో మాట్లాడారు. దేశీయంగా, విదేశాలలో ఎఫ్ సీవీ పొగాకుకు ఉన్న గిరాకీని, నిల్వలను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ లో 2025–26 పంట కాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతించినట్లు తెలిపారు. దక్షిణ ప్రాంత నల్ల రేగడి నేలలు (ఎస్‌బీఎస్) బ్యారన్ ఒక్కింటికి 3565 కేజీల పంట సాగుకు అనుమతించారన్నారు. అలాగే వివిధ దేశాల్లో 2025–26 పంట కాలానికి పండించిన పొగాకు ఉత్పత్తి గణాంకాలను వివరించి, రైతులు రాబోయే పంట కాలానికి రైతులు తమకు కేటాయించిన మేరకే పొగాకు సాగు చేపట్టాలని సూచించారు. అధిక ధరలతో భూమి, బ్యారన్‌లు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేయరాదన్నారు. అలాగే కొత్తగా అనధికారికంగా బ్యారన్‌లు నిర్మించవద్దని చెప్పారు. వాణిజ్య సరళిలో ఎఫ్ సీవీ పొగాకు నారుమడి సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా వారి పరిధిలోని పొగాకు బోర్డు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, పొగాకు రైతు సంఘం నాయకులు పోతుల నరసింహారావు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై విచారణ చేయండి

- నకిలీ సర్టిఫికెట్స్ ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలి
- జేసీకి వినతి పత్రం ఇచ్చిన డీవైఎఫ్ఐ నాయకులు



జేసీ గోపాల కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల విషయంపై భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టరేట్ గోపాల కృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రకాశం భవన్‌లోని ఆయన ఛాంబర్‌లో బుధవారం కలిసిన డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఎఫ్ బాబు ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎంపికైన అభ్యర్థులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎవరైతే ఎంపికయ్యారో వివాహమైన మహిళ అయితే ఆమె భర్త ఇన్‌కమ్ సర్టిఫికెట్, పురుషులు అయితే వారి లేటెస్ట్ సర్టిఫికెట్స్‌ను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్ సబ్జెక్టుకు ఎంపికైన వాళ్లలో కొంతమంది భూములు, పెళ్లిళ్లు అయిన తర్వాత భర్తలకు సొంత కంపెనీలు, ఆస్తులు ఉన్నప్పటికీ ఈడబ్ల్యూఎస్ తెచ్చుకుని ఉద్యోగానికి ఎంపికయ్యారన్నారు. ఇటువంటి వారి సర్టిఫికెట్స్‌పై సమగ్ర విచారణ జరపాలన్నారు. ఎవరైతే ఫేక్ సర్టిఫికెట్స్ ఇచ్చారో అటువంటి వారిని అనర్హులను చేసి తొలగించాలన్నారు. అదేవిధంగా అటువంటి వారిపై క్రిమినల్ కేసులు, నమోదు చేయాలన్నారు. అర్హులైన వారికి టీచర్ పోస్టులు ఇవ్వాలని కోరారు. దీనిపై జేసీ గోపాల కృష్ణ స్పందించి ఫేక్ సర్టిఫికెట్స్ ప్రొడ్యూస్ చేసి ఉన్నారో వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పి.నరేంద్ర, పి.రాంబాబు, జీ శ్రీనివాసులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ఒంగోలు: పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శైలజ బుధవారం తీర్పునిచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు కథనం మేరకు.. కొమరోలు మండలానికి చెందిన బాలిక తన అమ్మమ్మ ఇంట్లో నివసిస్తోంది. 2022 జూలై 11న ఉదయం 11.30 గంటల సమయంలో బాలిక ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే మండలానికి చెందిన కానే వెంకటేశ్వర్లు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటనను బాలిక తల్లి గమనించి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి కొమరోలు ఎస్సై సాంబశివయ్య కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా న్యాయమూర్తి ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నిందితుడిపై నేరం రుజువైనట్లు పేర్కొంటూ నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.15 వేలు జరిమానా విధించారు. బాధిత బాలికకు రూ.15 వేలు పరిహారం అందేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశించారు. కాగా ఎస్సై సాంబశివయ్య, కోర్టు లైజన్ ఏఎస్సై ఈవీ స్వామి, కానిస్టేబుల్ ఎం.యల్లమంద, ఏవీ సుబ్బారెడ్డిని ఎస్పీ దామోదర్ అభినందించారు.

రైతు బజార్లను పరిశీలించిన జేసీ

ఒంగోలు సబర్బన్: జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒంగోలు నగరంలోని మూడు రైతు బజార్లను బుధవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్న కర్నూలు ఉల్లిపాయాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను, వినియోగదారులను కూరగాయల ధరలను అడిగి తెలుసున్నారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు బజార్ల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జేసీ వెంట ఇతర అధికారులు ఎం.వరలక్ష్మీ, ప్రతాప్ రాజ్ కుమార్, డీఈఈ టి.పవన్ కుమార్‌తో పాటు రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రైతు బజారును సందర్శించిన జేసీ గోపాల కృష్ణ

విద్యార్థులకు దీన్ దయాళ్ స్పర్శ యోజన స్కాలర్ షిప్‌లు

ఒంగోలు వన్‌టౌన్: పోస్టల్ శాఖ నిర్వహించే ఫిలాటలీ స్టాంప్స్ కలెక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్ షిప్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకాశం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ యండీ మహ్మద్ జాఫర్ సాధిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం అమలుకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ విద్యనభ్యసించే వారు అర్హులన్నారు. అదే విదంగా 2024–25 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం సడలింపు ఉంటుందన్నారు. విద్యార్థులు తపాలా శాఖ నిర్వహించే రాత పరీక్ష, ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. రాత పరీక్ష సెప్టెంబర్ 30న రీజినల్ స్థాయిలో ఉంటుందని చెప్పారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 50 ప్రశ్నలకు 50 మార్కులు, మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో ఉంటుందన్నారు. రాత పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రాజెక్టు పరీక్షను నిర్వహిస్తారని, దీనిలో 5 పేజీలు, 500 పదాలు, 16 స్టాంపులు మించకుండా ప్రాజెక్టు సిద్ధం చేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ స్కాలర్ షిప్ పథకానికి ఎన్నికైన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున సంవత్సరానికి రూ.6 వేల స్కాలర్ షిప్‌ను అందిస్తారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు తమ దరఖాస్తులను పోస్ట్ ఆఫీస్‌లలో అందించాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి

- అపస్మారక స్థితిలోకి మరో ఇద్దరు..



మృతుడు రామారావు(ఫైల్)

కొండపి: పిడుగుపాటుకు ఒకరు మృతి చెందిన సంఘటన కొండపి పంచాయతీలోని కట్టవారిపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బెజవాడ రామారావు(45), బెజవాడ రమేష్ మామిళ్లపల్లి లక్ష్మయ్య రోజూ మాదిరిగానే గొర్రెలు మేపడానికి నేతివారిపాలెం సమీపంలో పొలాలకు వెళ్లారు. బుధవారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో ముగ్గురూ ఓ చెట్టు కిందకు చేరుకున్నారు. అకస్మాత్తుగా చెట్టుపై పిడుగు పడటంతో బెజవాడ రామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న రమేష్,లక్ష్మయ్య అపస్మారక స్థితిలో పడిపోయారు. సమీపంలో ఉన్నవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా రామారావు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న రమేష్, లక్ష్మయ్యకు కొండపి వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం రమేష్‌ను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు రామారావుకు భార్య రుక్మిణి, కుమారుడు వెంకట సాయి, కుమార్తె బ్రాహ్మణి ఉన్నారు. పిడుగుపాటుతో మృతి చెందిన రామారావు కుటుంబాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామాంజనేయులు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట వీఆర్వో సుశీల, పంచాయతీ సెక్రటరీ రామ్మోహన్‌రావు ఉన్నారు.

మోదీ పాలనలో రైతుల పరేషాన్

ఒంగోలు టౌన్: కేంద్రంలో మోదీ అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితంగా దేశంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి విమర్శించారు. రైతు సంఘం జిల్లా సమితి సమావేశం స్థానిక మల్లయ్యలింగం భవనంలో బుధవారం నిర్వహించారు. సమావేశానికి వడ్డే హనుమారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్లచట్టాల రద్దుకు పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చిన ప్రధాన మంత్రి మోదీ మాటనిలుపుకోలేదన్నారు. స్వామి నాథన్ కమిషన్ సూచనల మేరకు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు విధించడంతో అమెరికాలో మనదేశానికి చెందిన ఉత్పత్తులను కొనుగోలు చేయడంలేదని తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తికి 11 శాతం ఉన్న పన్నులను ఎత్తి వేయడం పత్తి రైతులకు శరాఘాతంగా మారిందన్నారు. మోదీ పాలనలో నాలుగున్నర లక్షల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇప్పటికీ రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి రైతుల సంతకాలతో మోదీకి వినతి పత్రం పంపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు నాయకులు డి.శ్రీనివాస్, బి.రామయ్య, పుల్లయ్య, టీవీ శేషయ్య, సీహెచ్ వాసు, ప్రసాద్, లెనిన్, ప్రభాకర్, వెంకటరావు, సాంబశివరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

ఏకేయూ డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

- ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ:

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ఏసీఈ డాక్టర్ ఎ.భారతీదేవి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. రెండో సెమిస్టర్ యూజీ పరీక్షలకు యూనివర్సిటీ పరిధిలోని 88 డిగ్రీ కళాశాల నుంచి బీఏ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్), బి.ఒకేషనల్, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ తదితర విభాగాలకు చెందిన 8,380 మంది విద్యార్థులకుగాను 7,512 మంది హాజరయ్యారు. వీరిలో 3,106 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఏసీఈ డాక్టర్ అంచుల భారతీదేవి తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వర్శిటీ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అభినందించారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ సోమశేఖర, ఏసీఈ సహాయకులు డాక్టర్ ఎన్. సురేష్, పలువురు ఉద్యోగులు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు తదితరులు